క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ

బనగానపల్లె: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహన డ్రైవర్లు నిబంధనలు అతిక్రమించడం చట్టప్రకారం నేరమన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని పలు వాహనదారులకు జరిమానా విధించారు.

పంట నమోదుతో అనేక ప్రయోజనాలు



రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి కళ్యాణి

డోన్ రూరల్: పండ్ల తోటలు వేసిన రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఉద్యానశాఖ అధికారి కళ్యాణి రైతులకు సూచించారు. మండల పరిధిలోని గోసానిపల్లి గ్రామంలో శుక్రవారం పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంట నమోదు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి రాయితీలు, రుణాలు, పరిహారం తదితర ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ఎంపీఈఓ సౌజన్య, ఉద్యాన శాఖ ఎంపీఈఓ మల్లిక పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

డోన్: శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాల, శ్రీరాముల దేవాలయం, మహాలక్ష్మి ఆలయాల్లో పలువురు దంపతులు వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకున్నారు. హోమ పూజలు చేశారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీలో విహరిస్తున్న అమ్మవారు

బనగానపల్లె: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి కర్పూర హారతులు ఇచ్చారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హిజ్రాలకు కౌన్సెలింగ్



హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ఇంతియాజ్‌బాషా

డోన్ టౌన్: ప్రజల నుంచి బలవంతంగా నగదు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఇంతియాజ్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రహదారుల్లో వాహనదారులు వెళుతున్నప్పుడు అడ్డుపడి వారి నుంచి నగదు వసూలు చేయరాదని సూచించారు. వారు ఇష్టప్రకారం ఇస్తే స్వీకరించాలే తప్ప బలవంతంగా వసూలు చేయరాదన్నారు. నగదు ఇవ్వని వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల్లో సానుభూతి ఉండేలా నడుచుకోవాలని హితవుపలికారు. ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్‌ఐ భాస్కర్, హెచ్‌సీలు చాంద్‌బాషా, నాగరాజు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన దేరంగుల సుబ్బారావు అనే మట్కాబీటర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. సమాచారం అందడంతో సుబ్బారావును అదుపులోకి తీసుకుని అతని వద్ద మట్కా చీటీలు, రూ. 840 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భద్రత కల్పించాలి



ఆపదలో ఉన్న వారికి ప్రాణం పోసే వైద్యులకు భద్రత కరువైంది. ఇటీవల కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనే ఇందుకు నిదర్శనం. ఇటీవల వైద్యులపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. పనిచేసే ప్రదేశంలోనే భద్రత లేకుంటే ఎలా? ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వైద్యశాలల్లో పోలీసులతో రక్షణ కల్పిస్తే బాగుంటుంది. అలాగే ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

– సాగరిక, వైద్యురాలు, శేషారెడ్డి సీహెచ్‌సీ, బేతంచెర్ల

వసతులు మెరుగుపర్చాలి



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి. వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేకపోవడంతో ముఖ్యంగా మహిళా వైద్యులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే సిబ్బందికి రక్షణ కూడా కరువైంది. ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసి వైద్యులు, వైద్య సిబ్బందికి అన్ని రకాల వసతులు, రక్షణ కల్పించేలా చట్టం చేయాలి.

–వెంకటలక్ష్మమ్మ, సీహెచ్‌ఓ, కొత్తబురుజు, ప్యాపిలి

వైద్యులపైనే దాడి చేస్తే ఎలా?



ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ వృత్తిలోకి వచ్చాం. అనారోగ్యం, ప్రమాదాల్లో గాయపడి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించి వారు సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళితే ఎంతో సంతోషిస్తాం. ఇది అర్థం చేసుకోకుండా కొందరు మూర్ఖంగా ప్రవర్తించడం బాధ కలిగిస్తుంది. మాలాంటి వైద్యులపైనే దాడి చేస్తే ఎలా పనిచేయాలి. కోల్‌కతా వైద్య విద్యార్థినిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి.

–జయభారత్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్, ఆకుమల్ల

గ్రామ సభలు కాదు..టీడీపీ సమావేశాలు

- పార్టీ కార్యక్రమంలా గ్రామ సభలు
- వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను కాదని పార్టీ నాయకులతో సమావేశం



టంగుటూరు గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



డోన్: వెంకటాపురంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

డోన్: టీడీపీ ప్రభుత్వం శుక్రవారం డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభలకు ప్రజల్లో స్పందన కరువైంది. ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల్లో సుమారు 90 శాతం మంది వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు మూడు మండలాల ప్రజాపరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వారికి ఎలాంటి సమాచారం అందించకుండానే గ్రామ సభలు నిర్వహించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగి అధికారులు వ్యవహరించడం విమర్శలకు దారితీసింది. ప్రతి గ్రామసభలోనూ ప్రజల భాగస్వామ్యం లేకుండా కేవలం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలోనే గ్రామ సభలు జరగడం విశేషం.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

బనగానపల్లె రూరల్: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని.. ఉపాధి పనుల అభివృద్ధి పనులు చేసుకోవాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామంలో సర్పంచ్ సూర్య నాగ మద్దిలేటి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో వలసల నివారణతో పాటు రైతులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధి కూలీలు తమకు రెండు నెలల నుంచి కూలి నగదు రాలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మంజుల వాణి, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఇన్‌చార్జీ ఎంపీడీఓ నాగరాజు, పీఆర్ డీఈఈ నాగశ్రీనివాసులు ఏఈ మహేష్, ఏపీడీ బాలాజీ నాయక్, ఏపీఓ హరికృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

- **కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల మేజర్ పంచాయతీతో పాటు మండలంలోని 16 పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు ఉపయోగపడే పనులకు ఉపాధి పథకంలో ప్రాధాన్యత కల్పించాలని, అడిగిన వారందరికీ పనులు చూపాలని తీర్మానించారు.
- **ప్యాపిలి:** గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన గ్రామసభలు

అవుకు: మండల పరిధిలోని 21 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు సమస్యలపై గళమెత్తారు. అవుకు మేజర్ పంచాయతీలో సర్పంచ్ మందా గుర్రమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, పశువైద్యాధికారిణి భారతీదేవి ఆధ్వర్యంలో సభ జరిగింది. ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

- **బేతంచెర్ల:** అందరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ వెంగన్న, తహసీల్దార్ ప్రకాశ్ బాబు అన్నారు. కొలుములపల్లె గ్రామంలో సర్పంచ్ చిన్న మద్దమ్మ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో వారు మాట్లాడారు.

మొక్కుబడిగా గ్రామసభ

డోన్ రూరల్: మండలంలో గ్రామ సభ మొక్కుబడిగా జరిగింది. నిమిషాల వ్యవధిలోనే సమావేశం ముగించారు. సభకు వచ్చిన ప్రజలు ఎందుకు సభ పెట్టారో ఏమోనని గుసగుస లాడుకుంటూ సభ నుంచి బయటకు పోయారు. కొందరు అధికారులు సభ ప్రారంభమైన రెండు నిమిషాలకే బయటకు వెళ్లిపోయారు. దొరపల్లి గ్రామంలో సభకు వచ్చిన విద్యుత్ అధికారులు కొద్దిసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పోలీసుల అదుపులో జూదరులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేట చెరువు సమీపంలో పేకాట స్థావరంపై సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7050 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో పొట్టేళ్లు మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో విద్యుత్ షాక్‌తో శుక్రవారం రాత్రి ఏడు పొట్టేళ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చిలుకూరి రామాంజనేయులు పొట్టేళ్లను ఇంటి వద్దనున్న దొడ్డిలో ఉంచాడు. సాయంత్రం కురిసిన వర్షానికి ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవహించడంతో 7 పొట్టేళ్లు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి గాయాలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని శ్రీచైతన్య స్కూల్లో తేనెటీగలు ఒక వ్యక్తిపై దాడి చేశాయి. పట్టణానికి చెందిన రమేష్ తన పిల్లలను స్థానిక చైతన్య స్కూల్లో చదివిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం క్యారియర్ తీసుకెళ్లాడు. అదే సమయంలో పాఠశాల గోడకు ఉన్న తేనెటీగలు అతనిపై దాడి చేశాయి. ఈ విషయం గ్రహించిన సిబ్బంది వెంటనే విద్యార్థులను తరగతి గదుల్లోకి పంపి కిటికీలు తలుపులు మూసివేయడంతో పెను ప్రమాదం తప్పింది. తేనెటీగల దాడిలో గాయపడిన రమేష్‌ను పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ఇస్రో ఆకారంలో విద్యార్థులు

కొలిమిగుండ్ల: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని పెట్నికోట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌గుప్త అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఇస్రో ఆకారంలో ఏర్పాటు చేసిన అక్షరమాల ఆకట్టుకుంది. శాస్త్రవేత్తలు తమ మేధాశక్తితో ఎన్నో అద్భుతాలు ఆవిష్కరించారని తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధనలో భారతీయ శాస్త్రవేత్తలు సాధించిన విజయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, మోహన్, చంద్రశేఖర్, సుందర్‌రాజు, భాస్కర్‌రెడ్డి, రాఘవేంద్రప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

డోన్ టౌన్: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాతపేట ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు రాకెట్ నమూనా తయారు చేసి ప్రదర్శించారు. అలాగే టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, బాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

పాఠశాలలో అపరిశుభ్రతపై జెడ్పీ సీఈఓ ఆగ్రహం



హాస్టల్ ఆవరణలో చెత్తను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సుబ్బారెడ్డి

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న జ్యోతిరావు పూలే బాలుర వసతి గృహం, బీసీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహాల్లోని స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశీలించి అక్కడ నెలకొన్న అపరిశుభ్రతపై వసతి గృహాల వార్డన్లు, పారిశుద్ధ్య సిబ్బందిపై మండిపడ్డారు. అలాగే విద్యార్థులకు తగినంత భోజనం, పప్పు, కూరలు లేకపోవడంతో పాటు, నాణ్యత లోపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. మరోసారి వసతి గృహాలను తనిఖీ చేసి తనకు నివేదిక అందజేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు, ఎంఈఓ స్వరూపలను ఆదేశించారు. హెచ్‌ఎం నాగేంద్ర, ఇన్‌చార్జ్ వార్డన్ రాఘవేంద్ర ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

- ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా

బేతంచెర్ల: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేయాలని నంద్యాల ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా అన్నారు. శుక్రవారం బేతంచెర్ల పోలీస్‌స్టేషను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. మండలంలోని గ్రామాల రూట్ మ్యాప్‌ను పరిశీలించి సమస్యాత్మక గ్రామాలపై ఆరా తీశారు. సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ పి.అశోక్, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. పట్టణంలో రాత్రి పూట గస్తీ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో నాటుసారా, అక్రమ మద్యం, పేకాటకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా వ్యవహరించాలన్నారు.

ఉమామహేశ్వరుని సేవలో ఎస్పీ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామిని ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన బోయ నాగిశెట్టి

డోన్ రూరల్: పెట్రోల్ బంక్ బంద్ చేసినందు వల్ల పెట్రోల్ పోయడం సాధ్యం కాదని చెప్పిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై అధికార పార్టీ శ్రేణులు దాడికి పాల్పడిన సంఘటన వెంకటాపురం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్‌లో వెంకటాపురం గ్రామానికి చెందిన బోయ నాగిశెట్టి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో కృష్ణగిరి మండలం లాల్‌మాన్‌పల్లె గ్రామానికి చెందిన కొందరు టీడీపీ శ్రేణులు నాగిశెట్టిని నిద్రలేపి బైక్‌కు పెట్రోల్ పోయమని అడిగారు. అయితే అందుకు ఆయన తిరస్కరించడంతో ఆగ్రహించి ఏకంగా నాగిశెట్టిపై దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడి తలకు తీవ్ర గాయమైంది. దాడి విషయం తెలిసిన వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది ఇలా ఉండగా లక్కసాగరానికి చెందిన టీడీపీ నాయకులు ఒకరు కేసు నమోదు కాకుండా అడ్డుపడుతున్నట్లు బాధిత బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసుల వివరణ కోరగా ఘర్షణ పడిన ఇరువర్గాల వారిని విచారిస్తున్నామని నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు



హెచ్ కొట్టాలలో మిరప రైతుకు సలహాలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బేతంచెర్ల: ఖరీఫ్ పంటల సాగులో తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలరాజు, ఆదినారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో వివిధ పంటలను పరిశీలించారు. ముఖ్యంగా వేరుశనగ పంటలో వర్షాలకు కాండం కుళ్లు, వేరుకుళ్లు వచ్చే అవకాశం ఉందని.. నివారణకు హెక్సనా జోల్‌ను లీటర్ నీటికి 2ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సజ్జ పంటలో కంకులకు శనగ పచ్చ పురుగు ఆశించి గింజలను తినడం జరుగుతుందని, నివారణకు ఎమాసిటిన్ బెంజోట్ మందును 0.5 గ్రాము ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మిరప పంటలో ఆకులు ఎర్రగా మారుతున్నాయని, వీటి నివారణకు ఎకరాకు కేజీ 19–19–19 మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏఓ కిరణ్ కుమార్, ఏఈఓ మధు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఏఎస్‌ఐకి సన్మానం



ఏఎస్‌ఐని సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు ఇటీవల ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు శుక్రవారం కోవెలకుంట్లలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, రాయలసీమ విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఓబులేసు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఎస్‌ఐని శాలువా, పూలమాలలతో సత్కరించారు. 20 ఏళ్ల పాటు కానిస్టేబుల్‌గా, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఏఎస్‌ఐగా పదోన్నతి పొందడం శుభపరిణామం అన్నారు. ఆయా సంఘాల నాయకులు జయరాజు, ప్రవీణ్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



శంకరాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

బేతంచెర్ల: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా.. అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ అశోక్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారామాపురం, శంకరాపురం, యంబాయి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. ఐకమత్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం

ప్యాపిలి: స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని తహసీల్దార్ భారతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, జూనియర్ కళాశాలల్లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ప్రకాశం పంతులు సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకులకు ఎదురుగా నిలిచిన గొప్ప ధైర్యశాలి అని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆంధ్ర కేసరికి ఘన నివాళి

డోన్: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణ త్యాగానికి సైతం వెనుకాడకుండా సర్వశక్తులు ఒడ్డి పోరాడిన మహనీయులను స్మరించుకోవడం కనీస బాధ్యత అని గోసానిపల్లె ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వెంకటలక్ష్మి అన్నారు. పాఠశాలలో ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా రొమ్ముచూపిన ధీశాలి టంగుటూరి అని కొనియాడారు. విద్యార్థులు, మహా నాయకుల పోరాట స్ఫూర్తిని అలవర్చుకుని ఉన్నత విద్యావంతులుగా రాణించాలన్నారు. ఉపాధ్యాయులు నాగలక్ష్మయ్య, మంజుల, సుందరరామయ్య, రమేష్‌బాబు, డాక్టర్ అనుగోలు, వేణుగోపాల్, సృజన, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలకు సకాలంలో బిల్లులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ శ్రీహరి గోపాల్

సంజామల: జగనన్న కాలనీల్లో 2023–24లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని.. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తామని జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీహరి గోపాల్ అన్నారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ.. డిసెంబర్ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన వెంటనే బిల్లులు సకాలంలో మంజూరు అవుతాయని తెలిపారు. కాలనీలో కనీసం నీళ్లు లేవని.. దూరం నుంచి తెచ్చుకుంటున్నామని లబ్ధిదారులు తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఈఈ హామీ ఇచ్చారు. హౌసింగ్ డీఈ క్రిష్టారెడ్డి, మండల ఏఈ బాల చంద్రుడు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు హజివలి, శంకర్ రెడ్డి, ఇంజినీర్ అసిస్టెంట్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు



నందిపాడులో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులయాదవ్

కొలిమిగుండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ శ్రీనివాసుల యాదవ్ అన్నారు. శుక్రవారం ఉపాధి హామీ పథకంపై కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినపేటలో నిర్వహించిన గ్రామ సభల్లో తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఉపాధి హామీలో రైతులకు అవసరమైన కార్యక్రమాలు ఉన్నాయని.. వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేసుకోవచ్చని చెప్పారు. ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై సర్పంచ్‌లతో పాటు గ్రామస్తుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కొలిమిగుండ్లలో లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్తులు, ఉపాధి కూలీలు ఎవరు లేకపోగా కూటమి నాయకులు హడావుడి చేశారు.

సారా స్వాధీనం.. నిందితుడి అరెస్ట్



గడ్డమేకులపల్లెలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

అవుకు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి, అవుకు ఎస్‌ఐ రాజారెడ్డి హెచ్చరించారు. గడ్డమేకులపల్లె గ్రామంలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం దాడి చేశారు. సారా తయారు చేస్తున్న దేవరకొండ పుల్లన్నను అదుపులోకి తీసుకుని 4500 లీటర్ల బెల్లం ఊటను పారబోసి, సారా తయారీ సామగ్రిని కాల్చివేశారు. అక్కడ ఉన్న 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. మండలంలో ఎవరైనా సారా తయారు చేసినా, అమ్మినా , మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారి గురించి తెలియజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో నాటు సారాను విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌ఐ సి.రమణయ్య అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపారు. గ్రామానికి చెందిన బిరుసంటి కిషోర్ సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఎస్‌ఐ కానిస్టేబుళ్లతో కలిసి దాడి చేశారు. నిందితుడి వద్ద నుంచి 30 సారా ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.